పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్య పడాల్

ప్రజాశక్తి-పాడేరు: జీకే వీధి మండల కేంద్రంలోని పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని సిఐటియు అల్లూరు జిల్లా అధ్యక్షులు. బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. సోమవారం జీకే విధి మండలం కేంద్రం పంచాయతీలోని పారిశుధ్య పనులు చేపడుతున్న పంచాయతీ కార్మికుల వద్దకు వెళ్లి చెల్లించవలసిన వేతన బకాయిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పంచాయతీ కేంద్రంలో ఆరుగురు పంచాయతీ పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారని. ఆరు నెలల నుంచి బకాయి పడ్డ జీతాలు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని ఆయన విమర్శించారు.కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. పెండింగ్లో ఉన్న ఆరు నెలల వేతనాలు ఇవ్వకపోతే మండల కార్యాలయం వద్ద సామూహిక నిరాహార దీక్షకు కుటుంబాలతో సహా దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకుడు, గాలికొండ వైస్ సర్పంచ్ ముర్ల చంటిబాబు కార్మికులు పాల్గొన్నారు.

నత్తనడకన నాడు నేడు

- రెండో విడత
నిధుల విడుదలలో జాప్యం
- పూర్తికాని మరుగుదొడ్లు

నాడు-నేడుకు ఎంపికైన ఉగ్గంగొయ్యి ప్రాథమిక పాఠశాల

ప్రజాశక్తి-పాడేరుటౌన్: వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.కోట్లు వెచ్చిస్తున్నామన్న ప్రజాప్రతినిధుల మాటలు నీటి మూటలు గానే మిగిలి పోతున్నాయి. అట్టహాసంగా పనులు ప్రారంభించి అనంతరం నిధులు లేమితో నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోతున్నాయి. నాడు నేడు రెండో విడత పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిధుల విడుదలలో కొనసాగుతున్న అంతులేని జాప్యమే దీనికి ప్రధాన కారణంగా నిలుస్తోంది. పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పన కోసం ఉద్దేశించిన ఈ కార్యక్రమంలో భాగంగా రెండో విడత కింద జిల్లాలోని 22 మండలాల పరిధిలో 945 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ మేరకు రూ.212 కోట్లు కేటాయించారు. తొలి విడతగా రూ.32 కోట్ల నిధులను పాఠశాలల ఖాతాలకు జమ చేశారు. ఆయా పనులు లక్ష్యం మేరకు ముందుకు సాగక పోవడంతో హెచ్ఎంలు, తల్లిదండ్రుల కమిటీలు, పర్యవేక్షణ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు అసంపూర్తి పనులతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఏ పని పూర్తి చేద్దామన్నా నిధుల కొరత వెంటాడుతోంది. ఇప్పటికే ఇచ్చిన అరకొర నిధులతో ఎక్కువమంది ఇసుక, ఇటుక రాయి ఖరీదు చేశారు. నిధులు లేక ఎక్కడ పనులు అక్కడే నిలిచాయి. ప్రభుత్వ పరంగా రావాల్సిన మెటీరియల్ కూడా అరకొరగానే వస్తోంది. దీంతో అసంపూర్తి మరమ్మతులతో ఆయా విద్యాలయాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి.

పాడేరు మండలం ఉగ్గంగొయ్యి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి (మరమ్మతు) పనులకు మంజూరైన రూ.11 లక్షల 95 వేలకు గానూ తొలి విడతగా .1లక్షా 79వేలు ఇచ్చారు. ఆ నిధులతో బోరు తవ్వించి, మరుగుదొడ్లకు మరమ్మతులు, దివ్యాంగులకు ర్యాంపు నిర్మాణం పనులు చేపట్టారు. ఆయా పనులు పూర్తికాకుండా వివిధ దశల్లో ఉన్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించే మనబడి నాడు-నేడు పనులకు సకాలంలో నిధులను విడుదల చేయక పోవడంపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మండలాల వారీగా నాడు నేడుకు ఎంపికైన పాఠశాలలు:

జిల్లాలో 945 పాఠశాలలను రెండో విడత నాడు-నేడులో అభివృద్ధికి ఎంపిక చేశారు. వీటిలో పాడేరు మండలంలో 26, మాడుగులలో 65, చింతపల్లిలో 100, జీకే.వీధిలో 63, కొయ్యూరులో 26, ముంచంగిపుట్టులో 68, పెదబయలులో 83, హుకుంపేటలో 49, డుంబ్రిగుడలో 81, అరకులోయలో 61, అనంతగిరి మండలంలో 50 పాఠశాలలు ఉన్నాయి. రంపచోడవరం మండలంలో 39, దేవీపట్నంలో 17, వై.రామవరంలో 29, అడ్డతీగలలో 30, గంగవరంలో 15, మారేడుమిల్లిలో 8, రాజవొమ్మంగిలో 34, ఏటపాకలో 32, చింతూరులో 32, కూనవరంలో 17, వీఆర్ పురంమండలంలో 5 పాఠశాలలను ఎంపిక చేశారు.

ఉగ్గంగొయ్యి ప్రాథమిక పాఠశాలలో నిలిచిన మరుగుదొడ్ల పనులు

నిందితుడిని మీడియా ముందు ప్రవేశ పెట్టి కేసు వివరాలు వెల్లడిస్తున్న సిఐ అశోక్‌కుమార్

భార్య హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీది మండలం, మొండిగడ్డ పంచాయతీ, గాలిమాను వీధిలో ఇటీవల భార్య విజయలక్ష్మిని నాటు తుపాకీతో కాల్చి చంపిన ఘటనకు సంబంధించి నిందితుడు గుబులంగి రామచంద్రరావును సోమవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం జికె.వీధి పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను జికె.వీధి సిఐ అశోక్ కుమార్ వెల్లడించారు. సిఐ కథనం ప్రకారం... మొండిగడ్డ పంచాయతీ గాలిమాను వీధికి చెందిన గుబులంగి రామచంద్రరావుకు ఒడిశా రాష్ట్రంలో బత్తరకు చెందిన విజయలక్ష్మికి 2009లో వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. రామచంద్రరావు మద్యానికి బానిసై భార్య విజయలక్ష్మితో తరచూ తగాదా పడుతుండేవాడు. భర్త ఏ పని చేయకుండా మద్యం సేవిస్తూ ఉండడంతో విజయలక్ష్మి కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేది. మద్యానికి డబ్బులు ఇవ్వమని తరచూ భార్యను వేధించేవాడు. ఇటీవల కాఫీ పిక్కలు అమ్మగా వచ్చిన డబ్బులను కుటుంబ పోషణ కోసం విజయలక్ష్మి తన దగ్గర ఉంచుకుంది. రామచంద్రరావు ఈ నెల 1వ తేదీన సాయంత్రం పూటిగా మద్యం సేవించి వచ్చి కాఫీ పిక్కలు అమ్మగా వచ్చిన డబ్బులు ఇవ్వమని భార్య విజయలక్ష్మితో గొడవపడ్డాడు. డబ్బులు ఇచ్చేందుకు విజయలక్ష్మి నిరాకరించింది. దీంతో అదే రోజు అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో రామచంద్రరావు తన దగ్గరున్న నాటు తుపాకీతో నిద్రలో ఉన్న విజయలక్ష్మి తొడపై కాల్చాడు. పెద్ద శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు సంఘటన ప్రదేశానికి చేరుకొని చూసే సరికి రామచంద్రరావుచేతిలో నాటుతుపాకీ ఉంది. నిందితుడిని పట్టుకునేందుకు స్థానికులు ప్రయత్నించగా, అతడు పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన విజయలక్ష్మి రక్త స్రావంతో తెల్లవారుజామున 4 గంటల సమయంలో మృతి చెందింది. నిందితుడు రామచంద్రరావు కోసం స్థానికులు గాలించినా ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసిన పోలీసులు ముమ్మరంగా తమ బలగాలతో గాలింపు చర్యలు చేపట్టారు. రింతాడ పంచాయతీ పరిధి మల్లమెట్ట జంక్షన్ వద్ద సోమవారం వాహన తనిఖీలు చేస్తుండగా నిందితుడు రామచంద్రరావు పట్టుబడ్డాడు. నిందితుడిని అరెస్టు చేసి, ఆయన వాడిన నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం రామచంద్రరావుపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. ఈ మీడియా సమావేశంలో జికె.వీధి ఎస్ఐ కె.అప్పలసూరి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

13న ఎమ్మెల్సీ పోలింగ్‌కు సిద్ధం

-ఎన్నికల నిబంధనలు పక్కాగా పాటించాలి
-తలారిసింగి పాఠశాలలో తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్
-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఈ నెల 13న జరగనున్న పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల నిర్వహణకు అధికారులు, సిబ్బంది పోలింగ్ నిర్వహణకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో ఎన్నికల జోనల్, రూట్, నోడల్, ప్రిసైడింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 11 మండలాల్లో 14 పోలింగ్ కేంద్రాల (అరకులో 2, పాడేరులో 2, సీలేరులో 2) తో పాటు హుకుంపేట మండలంలో అనుబంధ పోలింగ్ కేంద్రంతో కలిపి 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి 5 జోన్‌లు, 5 రూట్‌లుగా విభజించటం జరిగిందన్నారు. తలారిసింగి పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలతో పాటు తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పిఒ, ఎపిఒ, ఒపిఒలు 12వ తేదీ ఉదయం 8 గంటలకే అక్కడికి చేరుకొని ఎన్నికల సామాగ్రి తీసుకుని కేటాయించిన బస్సులలో జోనల్, రూట్ అధికారి పర్యవేక్షణలో కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో స్వంత వాహనాల్లో ఎన్నికల సామగ్రి తీసుకువెళ్లడం లేదా స్వయంగా ప్రయాణించడం చేయరాదని హెచ్చరించారు. ఎన్నికల నిభందనలు పక్కాగా పాటించాలని స్పష్టం చేసారు. తహసిల్దార్లు, ఎంపిడిఒలు, స్టేషన్ హౌస్ అధికారులు పోలింగ్ కేంద్రాల బయట గుంపుగా వ్యక్తులు లేకుండా చూడాలని ఆదేశించారు. సమస్య ఎదురైతే వారి ప్రత్యేక అధికారుల ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి నలుగురు సిబ్బంది ఉంటారని తెలిపారు. నోడల్, జోనల్, రూట్ అధికారులు పరస్పర సహాయ సహకారాలతో ఎన్నికల పోలింగ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి చేరే విధంగా నోడల్, జోనల్, రూట్ అధికారులు భాద్యత వహించాలని తెలిపారు. పోలింగ్ ముందు రోజే ఆయా పోలింగ్ కేంద్రాలలో మంచి నీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సిసి కెమెరాల ఏర్పాటులో జాగ్రత్తలు తీసుకోవాలని సబంధిత ఇంచార్జ్ హౌసింగ్ పిడిని ఆదేశించారు. జోనల్ అధికారులు ఎప్పటికప్పుడు పోల్ వివరాలను కలక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. రూట్ అధికారులు వారికి కేటాయించిన రూట్ లలో సిబ్బందిని చేరవేయాలన్నారు. ప్రిసైడింగ్ అధికారి డైరీ అత్యంత కీలకమని డైరీని అన్ని వివరాలతో పూరించి సీల్డ్ కవర్లో పెట్టి ప్రత్యేక కౌంటర్‌లో అందజేయాలన్నారు. బ్యాలట్ పేపర్, పేపర్ సీల్ అకౌంట్లని జాగ్రత్తగా నమోదు చేసి అందజేయాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రంలోకి పిఒకు తప్ప ఎవ్వరికీ మొబైల్ అనుమతి లేదని, మీడియా వ్యక్తులకు పోలింగ్ కేంద్రంలోనికి అనుమతి లేదని కలక్టర్ స్పష్టం చేసారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

మూడంచెల రక్షణ : ఎస్‌పి

ఎస్‌పి సతీష్ కుమార్ మాట్లాడుతూ, మూడంచెల రక్షణ విధానంలో పోలీసులు విధులు నిర్వర్తిస్తారని, ఎన్నికల సిబ్బంది ఎటువంటి భయానికి లోను కాకుండా సురక్షితంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద యునిఫాంలో విధులు నిర్వర్తిస్తారని, మిగిలిన ప్రాంతాలలో సివిల్ డ్రస్‌లో కుడా విధులు నిర్వర్తిస్తారని, పోలీసులు లేరనే అపోహ పడవద్దని తెలిపారు. వారం రోజుల ముందునుంచే అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని, ప్రతి రూట్ లో ఆయా స్టేషన్ హౌస్ ఆఫీసర్ పర్యవేక్షిస్తారని తెలిపారు. ఇది కాకుండా స్ట్రైకింగ్ ఫోర్సు కూడా పని చేస్తుందన్నారు. సమస్యలుంటే స్పెషల్ బ్రాంచ్ సిఐ అన్ని శాఖల సిబ్బందితో సమన్వయము చేసుకుని పరిష్కరిస్తారని, అవసరమైతే స్థానిక పోలీసుకు తెలియజేస్తారని వివరించారు. అనుమానితులను బైండ్ ఓవర్ చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జెసి జె.శివ శ్రీనివాసు, సబ్ కలక్టర్ వి.అభిషేక్, డిఆర్ఒ పి.అంబేద్కర్, ఎన్నికల ప్రత్యేక అధికారులు, జోనల్, రూట్, నోడల్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, పిఒలు, ఎపిఒలు, తహసిల్దారులు, ఎంపిడిఒలు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత పృథ్వీరాజు

సంతల్లో గిట్టుబాటు ధర ఏదీ?

ప్రజాశక్తి-పెదబయలురూరల్:గిరి రైతులు పండించిన మిరియాలు, పసుపు, పిప్పలు మోడీ వాణిజ్య పంటలకు కనీస ధర కల్పించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పృధ్వీరాజు డిమాండ్ చేశారు. సోమవారం పెదబయలు వారపు సంతలో ఆయన పర్యటించారు. పసుపు, పిప్పలు మోడ, రాజామ్ చిక్కులు, మిరియాలను తక్కువ ధరకు కొనుగోలు చేశార న్నారు. గత వారం జాయింట్ కలెక్టర్ మార్కెట్ లో పర్యటించిన సందర్భంలో గిట్టుబాటు ధర కల్పించి, ధరల పట్టిక సంబంధిత అధికారులు ఏర్పాటు చేయాలని, కలెక్టర్ కిలో మిరియాలు రూ, 500 ధర చెల్లించారని తెలిపారన్నారు.అయినా దళారీలు ఆ ఆదేశాలు పట్టించుకోలేదన్నారు.స్థానిక అధికారులు జోక్యం చేసుకొని గిరి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.లైజన్ వర్కర్స్‌తో కాఫి, మిరియాల ధరల పై రైతులకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. సంతల్లోని తుకాలో మోసాలను అరికట్టాలని, గిరి రైతు లు పండించిన వాణిజ్య పంటలు నేరుగా జిసిసి కొనుగోలు చేయాలని డిమాండ్ చేసారు.

8న మోదకొండమ్మ ఆలయ కమిటీ సమావేశం

ప్రజాశక్తి-పాడేరు:ఈ ఏడాది మోదకొండమ్మ అమ్మవారి వార్షిక ఉత్సవాలను మూడు రోజులపాటు పాడేరులో నిర్వహించేందుకు తేదీలను ఖరారు చేసేందుకు ఈనెల 8న బుధవారం ఆలయ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటగుళ్ళి సింహాచలం నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోదకొండమ్మ అమ్మవారి ఆలయ కమిటీ చైర్ పర్సన్, శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం వద్ద 8న బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాడేరు పట్టణంలోని గ్రామ పెద్దలు, భక్తులు, ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పక్షాల నేతలు, వ్యాపార ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలు ఈ సమావేశానికి హాజరు కావాలని ఒక ప్రకటనలో కోరారు.

పతకాలు, సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి-పాడేరు:ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో గెలుపొందిన అల్లూరి జిల్లా పరిధిలోని క్రీడాకారులకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పత కాలను, సర్టిఫికెట్లను సోమవారం కలెక్టరేట్లో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూరిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

క్రీడాకారులకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

స్పందన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే

ప్రజాశక్తి - రంపచోడవరం

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి వచ్చే దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో పిఒ సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటిడిఎ ఎపిఒ జనరల్ సిహెచ్.శ్రీనివాసరావు ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 57 దరఖాస్తులు అందాయి. దేవీపట్టణ మండలం తున్నూరు పంచాయతీ పరిధి, పొన్నూరులో అంగన్వాడీ కేంద్రానికి నూతన భవనం ఏర్పాటు చేయాలని, వేములకొండ నుండి తున్నూరు వరకు మూడు కిలోమీటర్ల బిటి రోడ్డు, ఆకూరు గ్రామం నుండి మామిడివలస వరకు ఐదు కిలోమీటర్లకు మెటల్ రోడ్డు ఏర్పాటు చేయాలని తున్నూరు సర్పంచ్ సాధల విజయ భాస్కరరెడ్డి వినతిపత్రం అందజేశారు. తూన్నూరు పంచాయితీ పరిధి వెలగపల్లి సెంటర్ నుండి పెదనుతులు వరకు 7కిలోమీటర్లు బిటి రోడ్డు నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయని, దానిని పూర్తి చేయాలని కొండ్ల శివారెడ్డి. ములగల శ్రీనివాస్ రెడ్డి దరఖాస్తు చేశారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, చిత్రంలో సబ్ కలెక్టర్ శుభం బన్సల్ తదితరులు

వై.రామవరం మండలం దళిపాడులో సర్వే నెంబర్ 14/1 లోని భూ సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామ సర్పంచ్ కర్రి వెంకయ్యమ్మ విన్నవించారు. మారేడుమిల్లి మండలం పందిరిమామిడి కోట గ్రామంలో 70మంది రబ్బర్ రైతులకు స్మోకింగ్ చాపర్ నిర్మించాలని రేవులా జానకి రెడ్డి, కత్తుల సోమిరెడ్డి విన్నవించారు. బురదకోట నుండి గుడ్లవాడ వరకు ఏడు కిలోమీటర్లకు మెటల్ రోడ్డు ఏర్పాటు చేయాలని పాతకోట సర్పంచ్ గొర్లె రేవతి దరఖాస్తు సమర్పించారు. రంపచోడవరం మండలం సూర్లవాడలో మూసివేసిన ఎంపీపీ స్కూల్‌ను తిరిగి తెరిపించాలని కుర్ల చిరంజీవి రెడ్డి, కుర్ల గంగిరెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డిఎస్ శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నాగేశ్వరరావు, ఎండి యూసఫ్, వెలుగు ఎపిడి ఎ.శ్రీనివాసరావు, పిహెచ్ఓ చిట్టిబాబు. డిఎల్‌పిఒ శ్రీనివాసరావు, డిఎల్‌డిఒ కోటేశ్వరరావు, డాక్టర్ రాధిక, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ గోపిక, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కల్పన, జిసిసి మేనేజర్ ఎం.నాగరాజారెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గేస్ట్‌మణి చర్చి పదో వార్షికోత్సవం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులోని గేస్ట్ మణి చర్చి 10వ వార్షికోత్సవం సోమవారం పాస్టర్ పి.జాన్ మేజోష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు చర్చిలో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. అనంతరం ఏపీ జెన్కో ఎస్ఇ కేకేవి.ప్రశాంత్ కుమార్, ఏడిఈ అప్పలనాయుడు, ఏఈ సురేష్ చేతుల మీదుగా 30 మంది వితంతువులకు చీరలు, స్థానిక యుసిఐఎం హాస్టల్ విద్యార్థులకు పెన్నులు, అట్టలు, రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన వారందరూ సహపంక్తి భోజనాలు చేశారు.

చర్చి ఆధ్వర్యాన పంపిణీ చేసిన రగ్గులను చూపుతున్న విద్యార్థులు

కళ్లద్దాలు అందజేస్తున్న ఎఎస్‌డిఎస్ వ్యవస్థాపక డైరెక్టర్ గాంధీబాబు తదితరులు

ఎఎస్‌డిఎస్ ఆధ్వర్యాన కళ్లద్దాల పంపిణీ

ప్రజాశక్తి-విఆర్.పురం

అలోక విజన్ ప్రోగ్రాం, వ్యవసాయక, సాంఘీక అభివృద్ధి సంస్థ (ఎఎస్‌డిఎస్) సంయుక్తంగా గత నెల 17న రేఖపల్లిలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న వారికి సోమవారం ఎఎస్‌డిఎస్ వ్యవస్థాపక డైరెక్టర్ వి.గాంధీబాబు చేతుల మీదుగా ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 162 మందికి కళ్ల జోళ్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులోనూ నేత్ర వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో ఉపాధ్యాయుడు మృతి

- యుటిఎఫ్ సంతాపం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని వాతంగి పంచాయతీ బట్టవారివీధి గ్రామంలో జిపి స్కూల్‌లో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న బీరబోయిన సుబ్బారావు (43) బ్రెయిన్ స్ట్రోక్‌తో సోమవారం తెల్లవారు మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం... సుబ్బారావుకు ఆదివారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి తన ఇంటివద్ద కుప్పకూలి పడిపోవడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి కి తరలించారు. అక్కడ డాక్టర్లు వైద్యం అందిస్తుండగా పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందారు. సుబ్బారావు స్వగ్రామం రాజవొమ్మంగి మండలం దోనెలపాలెం. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సుబ్బారావు మృతి చెందడంతో ఆయన స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సుబ్బారావు మృతికి యుటిఎఫ్ నాయకులు సంతాపం తెలిపారు.

సుబ్బారావు (ఫైల్‌ఫొటో)

అన్న సమారాధన

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు శివాలయంలో శుక్రవారం ఉమామహేశ్వర కల్యాణ మహోత్సవం జరిగిన నేపథ్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల ఆర్థిక సహాయంతో ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సుమారు 1000 మందికి పైగా భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఇంటర్ పరీక్షా కేంద్రం మంజూరుపై కాంగ్రెస్ హర్షం

ప్రజాశక్తి - సీలేరు

జీకే వీధి మండలం, సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఇంటర్ పరీక్ష కేంద్రం మంజూరు చేయడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కాంగ్రెస్ అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి కారే శ్రీనివాస్ మాట్లాడుతూ సీలేరులో ఇంటర్ పరీక్ష కేంద్రం మంజూరుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్, ఐటిడిఎ పిఓ రోణంకి గోపాలకృష్ణ, పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మికి ధన్యవాదాలు తెలిపారు. నాలుగేళ్ల క్రితం సీలేరులో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని రద్దు చేయడంతో ఇక్కడి విద్యార్థులు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న జికె.వీధి వెళ్లి పరీక్ష రాయాల్సి వచ్చేదని, సమయానికి బస్సు సర్వీసులు లేక నానా అవస్థలకు గురయ్యేవారని తెలిపారు. పరీక్ష కేంద్రం మంజూరు చేయాలని విద్యార్థులతో కలిసి నిరసనలు కార్యక్రమాలు చేపట్టడం, సమస్యలను అధికారుల కృష్టికి తీసుకెళ్లడం జరిగిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు దీనిపై దృష్టి సారించి పరీక్ష కేంద్రం మంజూరుకు కృషి చేయాలని తెలిపారు. సీలేరు బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి వరకు మాత్రమే తరగతులు నిర్వహిస్తున్నారని, వచ్చే విద్యా సంవత్సరం నుండి పదో తరగతి క్లాసులు ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, పిఒ, ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో సీలేరు, దారకొండ, దుప్పిలివాడ, గుమ్మరేవులు పంచాయతీల కాంగ్రెస్ అధ్యక్షులు ఎం.సత్తిబాబు, మల్లు దొర, అల్లంకి రాజు, బాబురావు, రాంబాబు, వానపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ విజయానికి విస్తృత ప్రచారం

కోరెడ్ల రమాప్రభకు ప్రజా సంఘాల మద్దతు

ప్రజాశక్తి- అనంతగిరి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో పిడిఎఫ్, ప్రజా సంఘాలు బలపరిచిన అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యాన జెడ్‌పిటిసి దీసరి. గంగరాజు, గిరిజన సంఘం మండల నాయకులు కోరారు.సోమవారం ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలకు వెళ్లి పట్టభద్రుల ఓటర్లను కలిసి, నమూనా బ్యాలెట్ పత్రాలను అందజేసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఎస్. నాగులు, టోకూరు సర్పంచ్ కిల్లో మొస్య, నాయకులు జి. దేవన్న, సురేష్ పాల్గొన్నారు

డుంబ్రిగుడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ సిఐటియు, గిరిజన సంఘం, సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని కోర్ర, కితలంగి, కిల్లోగూడ, నందివలస, గుంటసీమ గ్రామాల్లో కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు, గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.సూర్యనారాయణ పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు ప్రజా సంఘాల సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రజా సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో సోమవారం వారు ప్రసంగించారు. నిరుద్యోగ యువత, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యలు పిడిఎఫ్ అభ్యర్థి గెలుపుతోనే పరిష్కరించబడతాయని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ, అఖిలభారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పిఎస్ అజయ్ కుమార్, సామాజిక హక్కుల వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు రాజాన దొరబాబు, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరాలశెట్టి సత్యనారాయణ, ఎల్ఐసి ఏజెంట్ కుమార్, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు విత్తనాల పోతురాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణీంద్ర కుమార్, ఏఐటీయూసీ నేతఈశ్వరరావు, ఒమ్మి శ్రీను, సిఐటియు నాయకులు చలపతి పాల్గొన్నారు.

ఎఐవైఎఫ్ మద్దతు

ఎంవిపి.కాలనీ : డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు ఎఐవైఎఫ్ నేతలు మద్దతు ప్రకటించారు. ఈ మేరకు మద్దిలపాలెంలో సమావేశం నిర్వహించారు. సంఘం విశాఖ జిల్లా కన్వీనర్ ఎన్.మధు రెడ్డి, జివిఎంసి 15, 16 వార్డుల అధ్యక్షులు దారపు లక్ష్మణ్ రెడ్డి, రావి అశోక్, కెల్ల రమణ, రౌతునాయుడు పాల్గొన్నారు.

మధురవాడ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ తరుపున ప్రచారం చేస్తున్న వివిధ ప్రజా సంఘాల నాయకులు సాగర్‌నగర్ అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ, పట్టభద్రులు, ఉపాధ్యాయులకు కేటాయించిన సీట్లలో కూడా వైసిపి, టిడిపి తమ అభ్యర్థులను పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల తరుపున ప్రశ్నించే గొంతుకలు మండలిలో ఉండకూడదని ఈ పార్టీలు విశ్వ ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. విజ్ఞులైన పట్టభద్రులు డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం గుడ్లవాని పాలెం, సాగర్ నగర్, సుభాష్ నగర్, ముసలయ్యపాలెం తదితర ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ కార్యదర్శి పి.రాజ్‌కుమార్, డివైఎఫ్ఐ నాయకులు వై.రాము, కెవిపిఎస్ నాయకులు విజయ్, జెవివి నాయకులు మురళిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ స్టీల్‌ప్లాంట్‌లోని స్టోర్ జంక్షన్ వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై పిడిఎఫ్ అభ్యర్థులు మాత్రమే పోరాడతారన్నారు. మన వాణిని అసెంబ్లీలో వినిపించేందుకు డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టీల్ కార్మిక సంఘాల ప్రతినిధులు జె.రామకృష్ణ, రామ్‌కుమార్, డివి.రమణారెడ్డి, బి.కామేశ్వరరావు, కర్ర ప్రకాష్, ఎన్.కృష్ణారావు, డేవిడ్, స్టీల్ సిఐటియు ప్రతినిధులు బి.అప్పారావు, పి.శ్రీనివాసరాజు, పి.నీలకంఠరావు, వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

పెందుర్తి : జివిఎంసి 94, 95, 97 వార్డులో పరిధిలో డాక్టర్ రమాప్రభ గెలుపును కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. 94వ వార్డు పరిధి రవినగర్, భాష్యం పాఠశాల ఐద్వా నాయకులు రమణి, సిఐటియు నాయకులు శంకరరావు, కృష్ణరాయపురంలో సిఐటియు నాయకులు బిటి.మూర్తి, 97వ వార్డు పరిధి చినముసిడివాడలో సిఐటియు నాయకులు మౌలాలి, లక్ష్మణరావు, జగన్నాధస్వామి, 95వ వార్డు పరిధి గొల్లవిల్లిపాలెం, పాపారాయుపాలెం ప్రాంతాల్లో సిఐటియు నాయకులు సూర్య ప్రకాష్, జయబాబు పట్టభద్రులను కలిసి కోరెడ్ల రమాప్రభ గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఐద్వా నేత రమణి మాట్లాడుతూ, శాసనమండలిలో ప్రజల తరుపున పిడిఎఫ్ ఎమ్మెల్సీలే పోరాడుతున్నారని గుర్తుచేశారు. పట్టభద్రులు ఆలోచించి ఉన్నతమైన వ్యక్తికే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

అనకాపల్లిలో రమాప్రభకు మద్దతు ప్రకటిస్తున్న ప్రజాసంఘాలు

ఉక్కునగరంలో పోస్టర్ ఆవిష్కరణ

మధురవాడలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు


పెందుర్తిలో ఎన్నికల ప్రచారంలో ఐద్వా, సిఐటియు నేతలు

కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

పట్టణ పౌర సంఘాల సమాఖ్య రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు

అచ్యుతాపురం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టణ పౌర సంఘాల సమాఖ్య రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని పూడిమడక, అచ్యుతాపురం తదితర గ్రామాల్లో రమాప్రభను గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పట్టభద్రులను కలిసి మాట్లాడారు. ఉత్తరాంధ్ర సమస్యలను శాసనమండలి దృష్టికి తీసుకెళ్లే విధంగా రమాప్రభ పోరాడుతారని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రజల అభివృద్ధికి రమాప్రభ గెలుపు ఎంతో అవసరం ఉందని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాష్ట్ర నాయకులు కె.లోకనాథం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.రాము, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.సోము నాయుడు, మత్స్య కార్మిక సంఘం జిల్లా నాయకులు చోడిపల్లి అప్పారావు, చేపల తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో ప్రచారంలో పాల్గొన్న పౌరసంఘాల నేత వైవి

హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా 10న చింతపల్లిలో మహాధర్నా

గిరిజన సంఘం జాతీయ కమిటీ సభ్యులు అప్పలనర్స

మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత అప్పలనర్స

ప్రజాశక్తి -పాడేరు : అల్లూరి మన్యంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణాలకు వ్యతిరేకంగా ఈ నెల 10న చింతపల్లిలో మహాధర్నా నిర్వహించనున్నట్లు గిరిజన సంఘం జాతీయ కమిటీ సభ్యులు పి అప్పల నర్స వెల్లడించారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో చింతపల్లి, అనంతగిరి ప్రాంతాల్లో 1200 మెగావాట్ల విద్యుదుత్పత్తికి నాలుగు హైడ్రో పవర్ ప్రాజెక్టులను, ఈ నాలుగు యూనిట్లకు సంబంధించి ఎగువన ఎనిమిది డ్యాముల నిర్మాణాలకు ప్రతిపాదనలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం,

ఇటీవల విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ప్రపంచ పెట్టుబడిదారులను ఆహ్వానిస్తూ రెడ్ కార్పెట్ పరిచిందన్నారు. ఒకవైపు మన్యంలో హైడ్రో పవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలని అల్లూరి జిల్లా గిరిజనులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుంటే, ప్రభుత్వం ఏకపక్షంగా నిర్లక్ష్యంగా, గిరిజనుల మనోభావాలేవీ తమకు పట్టవన్నట్లు దూకుడుగా ముందుకు వెళ్లడం దారుణమన్నారు. అటవీ సంపదను ఆదానీ కంపెనీకి కట్టబెట్టేందుకు పెద్దకుట్ర చేస్తుందని ఆరోపించారు.

గిరిజనుల మనోభావాల్ని గౌరవిస్తామని చెప్పిన సిఎం జగన్, జిఒ91 రద్దు చేస్తున్నట్లు ఒకవైపు ప్రకటిస్తూనే, నేడు అదే ప్రాంతంలో హైడ్రోపవర్ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ గిరిజనులు ఆందోళనలు చేస్తుంటే నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమని విమర్శించారు. పీసా కమిటీ, ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఆమోదం లేకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా సహజ సంపదను అమ్మేస్తామన్న పద్ధతిలో ప్రభుత్వ వైఖరి ఉండడం చట్టరీత్యానేరం, అన్యాయమన్నారు. ఇటీవల బడ్జెట్లో గ్రీన్ ఎనర్జీకి రూ.18 వేల కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం, మరోవైపు ఇలాంటి చర్యలను అడ్డుకోకపోవడం శోచనీయమన్నారు. జిఒ 3 రద్దుపై మన్యంలో కొనసాగుతున్న ఆందోళనలపై ప్రభుత్వాలు స్పందించకపోవడం గిరిజనుల పట్ల వారికున్న చిత్తశుద్ధికి అద్దం పడుతున్నాయన్నారు. గడిచిన రెండున్నర సంవత్సరాల కాలంలో గిరిజన సంక్షేమ శాఖలో కనీసం ఒక్క ఉద్యోగం గాని ప్రమోషన్ గాని ఇవ్వలేదన్నారు వీటన్నింటికీ నిరసనగా చేపట్టే ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోనంగి చిన్నయ్య పడాల్, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ పాల్గొన్నారు.

అడవులను దహించేస్తున్న కార్చిచ్చు

తైడా ఘాట్ రోడ్డు అడవుల్లో మండుతున్న కార్చిచ్చు

ప్రజాశక్తి -అనంతగిరి : వేసవి కాలం తొలిరోజుల్లోనే అల్లూరి మన్యంలోని అడవులను కార్చిచ్చు దహించివేస్తోంది. ఇపుడిపుడే ఎండలు మండుతున్న తరుణంలో అడవుల్లో చెట్ల కింద ఆకులురాలి, అవి కాస్తా ఎండడంతో ఎక్కడైనా వాంఛితంగానైనా, లేకుంటే ప్రమాదభరితంగానైనా నిప్పు రాజుకుంటే ఇక అంతేసంగతులు. అడవంతా మంటలు వ్యాపించి సర్వం బూడిదయ్యే పరిస్థితి ఉందని స్థానికులు అంటున్నారు. అనంతగిరి ఘాట్‌రోడ్డులో శివలింగాపురం, తైడ, డముకు, అనంతగిరి ప్రాంతాల్లో రాజుకున్న కార్చిచ్చు కొండలను ఆహుతి చేస్తోంది. ప్రస్తుతం జీడి,మామిడి పంట దశల్లో ఉన్న తోటలు, చెట్లకు ఈ కార్చిచ్చుతో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని గిరిజన రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు అడవుల్లోని వన్యప్రాణులు కార్చిచ్చులో సజీవదహనమయ్యే ముప్పు కూడా పొంచి ఉందని అంటున్నారు. దీంతో మన్యంలోని గిరిజనులు కార్చిచ్చు బారి నుంచి తమ తోటలు, పంటలను కాపాడుకునేందుకు ఎవరితోటలో వారు ఫైర్ బాటలు ఏర్పరచుకునే పనుల్లో నిమగ్నమై అప్రమత్తంగా ఉంటున్నారు.

మైనర్లకు వాహనాలివ్వడం నేరం

అవగాహన కల్పిస్తున్న సిఐ బాజీలాల్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మైనర్లకు వాహనాలు నడపడానికి ఇవ్వడం చట్టరీత్యా నేరమని స్థానిక సిఐ బాజీలాల్ సూచించారు. సోమవారం సాయంత్రం ఎస్ఐ షరీఫ్ ఆధ్వర్యంలో జడ్డంగిలో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సిఐ బాజీలాల్ మాట్లాడుతూ మైనర్లకు వాహనం ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనదారులందరూ విధిగా వాహనరికార్డులతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం మత్తులో వాహనాలను నడిపితే గతంలో ఉన్న రూ.రెండు వేల జరిమానాను ప్రభుత్వం ఇపుడు రూ.పది వేలకు పెంచిందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడిపితే ప్రమాదాలకు ఆస్కారముండదన్నారు. వాహనాలలో నాటు సారాయి, గంజాయి వంటివి నిషేధిత వస్తువులను రవాణా

అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోండి

టిడిపి ఆధ్వర్యాన రైతుల ధర్నా, వినతి

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని వాలసీ పంచాయతీ నిమ్మలపాడు కాల్‌సైట్ మైనింగ్‌లో ఎపిఎండిసి పేరుతో అక్రమ తవ్వకాలకు పాల్పడిన మైనింగ్‌దారులపై గతు చర్యలు తీసుకోవాలని టిడిపి నేతలు కోరారు. మైనింగ్ భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా నిలువు దోపిడీకి పాల్పడిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రం వద్ద బాధిత రైతులు ధర్నా నిర్వహించారు.అనంతరం స్థానిక రెవిన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మైనింగ్ తవ్వకాలను వెంటనే నిలుపుదల చేయాలని, రైతులకు నష్టపరిహారం చెల్లించి, గ్రామాలను అభివృద్ధి చేయాలని, ఎపిఎండిసి గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు శివేరిదొన్నుదొర, టిడిపి జిల్లా మాజీ వైస్‌చైర్మన్ కె.అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్, కాబోయే ఎమ్మెల్సీ కుంభారవిబాబు అక్రమ మైనింగ్‌కు బినామీగా వ్యవహరిస్తూ మండలానికి చెందిన దురియ రుక్మిణి, రొబ్బ. శంకరరావు పేర్లు మీదుగా మైనింగ్ తవ్వకాలకు అనుమతులు పొంది, భూములు ఇచ్చిన రైతులకు, పనులు చేసిన కూలీలకు ఎనిమిది నెలలుగా పరిహారం, వేతనం చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అయితే అక్రమ మైనింగ్‌ను యథేచ్ఛగా జరుపుకుంటున్నారని ఆరోపించారు. రైతులకు నష్ట పరిహారం చెల్లించకుండా మైనింగ్ జోలికి వస్తే రైతులతో కలిసి తరిమికొడతామని హెచ్చరించారు కార్యక్రమంలో టిడిపి నాయకులు బి .లక్ష్మి సర్పంచ్ జె.అప్పారావు మాజీ సర్పంచ్ బి.ధర్మన్న కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న పిఒ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం తన చాంబర్‌లో ఇంటర్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడేరు ఐటిడిఎ పరిధిలో 16 కేంద్రాలలో ఇంటర్ పరీక్షలు జరగనున్నాయని, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్తు, తాగునీరు, వైద్యసదుపాయాలను కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులు నేలపై పరీక్షలు రాసే పరిస్థితి ఉండకూడదని, అన్ని పరీక్ష కేంద్రాల్లోని గదుల్లో బెంచీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

ఐటిడిఎ పరిధిలో 16 పరీక్షా కేంద్రాల ఏర్పాటు..

పాడేరు ఐటిడిఎ పరిధిలోని 11 మండలాల్లో 16 పరీక్షా కేంద్రాలలో 8500 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాస్తారన్నారు. ఈ ఏడాది కొత్తగా కొయ్యూరు, ముంచంగిపుట్టు, ఎగువ సీలేరు, చింతపల్లి, జికె వీధి, అనంతగిరి మండలాల్లో ఇంటర్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు జరిగే పరీక్షలకు విద్యార్థులకు సకాలంలో చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద జెరాక్స్ సెంటర్లను ఉదయం 8.30 గంటల నుండి 12 గంటల వరకు మూసి వేయాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేర్చేందుకు వీలుగా ఆర్‌టిసి బస్సు సర్వీసులను నడపాలని ఆర్‌టిసి అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాలకు అంతరాయం లేని విద్యుత్తు సరఫరా చేయాలని ట్రాన్స్ కో అధికారులను ఆదేశించారు.

కట్టుదిట్టమైన పోలీస్ బందో బస్తు..

ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద ఈనెల 15వ తేదీ నుండి 29వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సమస్యాత్మక కేంద్రాలలో అదనపు పోలీసులను నియమించి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారుపరీక్షా కేంద్రాలను ఐటిడిఎ కమాండ్ కంట్రోల్ రూంకి అను సంధానం చేసి పర్యవేక్షిస్తామని చెప్పారు. పరీక్షల పర్యవేక్షణకు ఎనిమిది సిట్టింగ్, నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్లలతోపాటు అదనపు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని ఆర్ఐఒను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల లోపలికి బయట వ్యక్తులను అనుమతించ కూడదన్నారు. జవాబు పత్రాలను నిర్దేశించిన సమయానికి పంపించాలని పోస్టల్ అధికారులకు సూచించారు. ఇంటర్మీడియట్ వెబ్‌సైట్ నుండి హాల్ టికెట్ లు పొందే సౌకర్యాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు హాలుటికెట్లు పొందడంలో సమస్యలు తలెత్తితే 0891 2552954 హెల్ప్ లైనుకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.డిఆర్ఒ పి.అంబేద్కర్, ఆర్ఐఒ, పి.ఉమారాణి, డిఇఒ డాక్టర్ పి.రమేష్, ఎపిఎస్ ఆర్‌టిసి డిఎం ఆర్ఎస్ నాయుడు, డిపిఒ కొండలరావు, డిఎల్‌పిఒ పిఎస్ కుమార్, సిఐ సుధాకర్, ఎస్ఐ రంజిత్ పాల్గొన్నారు.

వేటగాళ్ల ఉచ్చులో పడి జింకకు తీవ్ర గాయాలు

జింకకు చికిత్స చేస్తున్న వెటర్నరీ సిబ్బంది

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని సింగంపల్లి సమీపంలో వేటగాళ్ల ఉచ్చులో పడి తీవ్రగాయాలైన చుక్కల జింకను సోమవారం స్థానికులు గుర్తించారు. దీనిపై అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి గాయపడిన జింకను కాపాడి, జడ్డంగి వెటర్నరీ ఆసుపత్రికి తరలించారు. పశువైద్యాధికారి, సిబ్బంది ఆధ్వర్యంలో దానికి చికిత్స నిర్వహించారు. అయితే ఉచ్చులో పడి తీవ్ర గాయాలపై జింక ఆరోగ్యపరిస్థితి విషమంగానే ఉందని వెటర్నరీ సిబ్బంది వెల్లడించారు. చికిత్స అనంతరం అటవీశాఖకు అప్పగించారు.

గిరిజన గర్భిణుల ప్రసవ వేదన.. అరణ్య రోదన!

- ప్రసవానికి వెళ్లాలంటే నేటికీ పరేషాన్
- బైక్‌పై వెళుతూ మార్గమధ్యలో మగబిడ్డకు జననం
- తల్లీబిడ్డ క్షేమంతో ఊపిరిపీల్చుకున్న కుటుంబీకులు
- చింతూరు మండలం, అంజలి శనివారంలో ఘటన

మార్గమధ్యలో అడవిలో పుట్టిన మగ బిడ్డ, బాలింత

ప్రజాశక్తి-పాడేరు టౌన్: బిడ్డకు జన్మనివ్వడమంటే.. మరో జన్మేనని పూర్వికులు అన్నమాటలు అల్లూరి మన్యంలోని గిరిజన గర్భిణులు అచ్చంగా అచ్చుగుద్దినట్లు సరిపోతాయి. గర్భం దాల్చిన నుంచి బిడ్డకు జన్మనిచ్చేవరకు వారు పడే వేతన, అవస్థలు అన్నీ ఇన్నీకాదు. వైద్యపరీక్షలు, వ్యాక్సినేషన్, నెలసరి ఆరోగ్యతనిఖీలు మొదలుకుని, చివరకు ప్రసవానికి కూడా వీరు ఇతరప్రాంతాలకు వెళ్లేందుకు నానా అగచాట్లు పడక తప్పడం లేదు.

ప్రభుత్వపరంగా కొన్ని సదుపాయాలు కల్పిస్తున్నప్పటికీ, అవి వీరికి అందనంత దూరంలో ఉన్నాయనే చెప్పాలి. ఏజెన్సీలో ప్రసవ వేదన పడుతున్న గర్భిణులు పురిటినొప్పులు పడుతూనే కాలినడకన వెళ్లే పరిస్థితులు మొదలుకుని, డోలి, కావిడిలలో మోసుకుని వెళ్లడం, మోటారు సైకిళ్లపై ఎక్కించుకుని డెలివరీకి తీసుకెళ్లే ఘటనలు ఇక్కడ సర్వసాదారణంగా మారిపోయాయి. తరచూ ఇలాంటి ఘటనలే పునరావృత మౌతున్నా పట్టించుకోని పరిస్థితుల్లో తాజాగా అలాంటి ఘటనే చింతపల్లిలోనూ చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... రహదారి లేని దుస్థితిలో ప్రసవ వేదన పడుతున్న ఆదివాసి మహిళను గ్రామస్తులు ద్విచక్ర వాహనంలో తరలిస్తుండగా పురిటి నొప్పులు ఎక్కువై మార్గమధ్యలో ప్రసవించిన ఘటన అల్లూరి జిల్లా చింతపల్లి మండలంలో చోటు చేసుకుంది. అంజలి శనివారం పంచాయతీ పరిధిలోని పాలమామిడి గ్రామానికి వాహనాలు వెళ్లే మార్గం లేదు. బైక్‌లు వెళ్లేందుకు కాస్త బాటను గ్రామస్తులే బాట ఏర్పాటు చేసుకున్నారు. ఆ గ్రామానికి చెందిన సిదరి దేవికి సోమవారం పురిటి నొప్పులు రావడంతో వేరే మార్గంలేని పరిస్థితుల్లో గ్రామస్తుల సహకారంతో బైక్‌పై ఎక్కించుకుని, అటవీ మార్గంలో ఆసుపత్రికి తరలించే ప్రయత్నంలో మార్గమధ్యలోనే పురిటినొప్పులు ఎక్కువై ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత పచ్చిబాలింత అయినప్పటికీ, కొద్ది దూరం నడుచుకుని వచ్చి అక్కడ నుంచి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు చెప్పడంతో వారంతా ఊపిరిపీల్చుకున్నారు. ఇక్కడ వ్యవహారం సుఖాంతం కావడంతో అందరూ సంతోషించినా, జరగరానిది, జరిగితే పరిస్థితి ఏంటన్న ఆందోళన అందరిలోనూ ఉంది.

నేటికీ అభివద్ధికి ఆమడ దూరం..

గిరిజన ప్రాంతంలో గ్రామాల ఆదివాసీలకు నేటికీ కష్టాలు రోజురోజుకూ ఎక్కువవు తున్నాయే తప్ప, సౌకర్యాలు మెరుగుపడే పరిస్థితి లేదనే ఆరోపణలున్నాయి. అభివద్ధికి ఆమడ దూరంలో ఉంటూ, అత్యవసర పరిస్థితుల్లో రహదారులు సైతం లేక ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని దేవునిపైనే భారం వేస్తూ మన్యవాసులు దినదినగండంగా జీవనం సాగిస్తున్నారని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పరిపాలనకు సచివాలయ సిబ్బంది, వారికి తోడు వలంటీర్లు ఉన్నారని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం మాటలే తప్ప నాలుగున్నర ఏళ్లలో గిరిజన గ్రామాల్లో ఒరగబెట్టిందేమీ లేదని ఆరోపిస్తున్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపిడిఒ బాపన్న దొర

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ కె.బాపన్న దొర ఆదేశించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ సక్రమంగా అమలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కె బాపన్న దొర మాట్లాడుతూ, గ్రామాలలో రక్షిత మంచినీటి పథకాలు, చేతిపంపులు సక్రమంగా పని చేసేలా చర్యలు చేపట్టాల సూచించారు. గ్రామాల్లో ప్రధాన జంక్షన్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, మిషన్ అంత్యోదయ, జిజిఎంపి పనులు, ఎన్ఆర్ఇజిఎస్ అకౌంట్లు, బయో డైవర్సిటీ అకౌంట్స్, గ్రామపంచాయతీ జనరల్ ఫండ్, 15 ఆర్థిక సంఘం నిధులపై ఆరా తీశారు. క్లాప్ మిత్రలకు జీతాలు, ఎస్‌డబ్ల్యూపిసి షెడ్ల పనితీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్‌హెచ్ 5ఇ రోడ్డు విస్తరణలో పంచాయతీ ఆస్తులకు నష్టం వాటిల్లితే సంబంధిత సమాచారం తన దృష్టికి తేవాలని ఆదేశించారు. అనంతరం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించి మార్చి నెలాఖరుకు ఉపాధి పనుల లక్ష్యాలను పూర్తిచేయాలని, ఆధార్ సీడింగ్ క్లోజ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఉపాధి హామీ ఎపిఒ సురేష్, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నారు.

ఇనుప విద్యుత్ స్తంభానికి 'బీట'లు

ప్రమాదభరితంగా ఉన్నా పట్టించుకోని అధికారులు

ఆందోళన చెందుతున్న గిరిజనులు

బీట గ్రామంలో అడుగున రంధ్రం ఏర్పడిన విద్యుత్‌స్తంభం

ప్రజాశక్తి- ముంచంగిపుట్టు : మండలంలోని సుజనకోట పంచాయతీ బీట గ్రామంలో గంపర్రై బాబురావు ఇంటి ఎదుటనున్న ఇనుప విద్యుత్‌స్తంభం ప్రమాదభరితంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈస్థంభం అడుగుభాగాన పెద్ద రంధ్రం ఏర్పడడంతో ఏ క్షణాన పడిపోతుందోనని భయాందోళనలు చెందుతున్నారు. రానున్న వేసవి కాలంలో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురవడం సర్వసాదారణమైన పరిస్థితుల్లో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ప్రమాదభరిత ఈ విద్యుత్ స్తంభం మార్పుచేయాలని ఇప్పటికే పలుమార్లు సంబంధిత విద్యుత్‌శాఖాధికారులకు అనేకమార్లు విన్నవించినా స్పందించడంలేదని ఆవేదన చెందుతున్నారు. గత నెలలో హుకుంపేటలో ఇలాగే విద్యుత్‌స్తంభం కూలిపోవడంతో పాఠశాలలో చిన్నారి మృతి చెందిన ఘటన చోటుచేసుకుందని, అలాంటి ప్రమాదమే ఇక్కడా సంభవించకుండా తక్షణ చర్యలు చేపట్టి, పాడైన విద్యుత్‌స్తంభం స్థానంలో కొత్తదాన్ని మార్పు చేయాలని బీట గ్రామస్తులు కోరుతున్నారు.